తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:75

24 క్యారెట్లు 140,200.00 | కిలో వెండి 1,95,000.00 | chourastha Digitals | 15.11.2026 ఆదివారం, హైదరాబాద్

నెహ్రూ దార్శనికతే ఆధునిక భారతానికి పునాది

- దక్షిణ భారతదేశమంతటా నెహ్రూవియన్ భావజాలాన్ని విస్తరిస్తాం
- హైదరాబాద్‌లో సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ప్రారంభం
- ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథమే నెహ్రూ ఆశయాలు
- విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం
- చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు తగవన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2లో

ఫాసిస్టు శక్తుల ఆగడాలు పెరిగిపోయాయి..

కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్

- భారత్ సమ్మిట్‌లో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- 2014, 2024 ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు
- ద్వేషంతో కాదు.. ప్రేమ, అహింసతోనే పోరాటం చేస్తాం
- అదానీ వ్యాపార సామ్రాజ్యం మోదీ హయాంలోనే విస్తరించింది

2లో



దేశంలో ఫాసిస్టు శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలు, దేశ రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ప్రక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిన పలువురు విదేశీ నాయకులు, ప్రతినిధులకు చివరి నిమిషంలో వీసాలు రద్దు చేయడంతో వారు కార్యక్రమానికి రాలేకపోయారని ఆరోపిస్తూ వారికి క్షమాపణలు తెలిపారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో



డెలివరీ బాయ్స్‌కు బీమా భరోసా

- గిగ్ వర్కర్ల కోసం తెలంగాణ సర్కార్ కొత్త పథకం
- గిగ్ కార్మికులకు ఇక సామాజిక భద్రత.. సంక్షేమ పథకానికి శ్రీకారం
- సంక్షేమ పథకాన్ని ప్రారంభించిన రాహుల్, రేవంత్
- రూ.10 లక్షల ఆరోగ్య బీమా.. రూ.5 లక్షల ప్రమాద బీమా
- ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు
- ప్రతి డెలివరీపై కార్మికులకు వాటా
- రెస్ట్ హౌస్‌లు, పింఛన్, ఇతర ప్రయోజనాలు

2లో

గిగ్ వర్కర్ల సంక్షేమం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. యాప్ ఆధారిత సేవల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఇతర గిగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే సంక్షేమ పథకాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని జయభేరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన గిగ్ వర్కర్ల బహిరంగ సభలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో



రాంచందర్‌రావు హౌస్ అరెస్ట్..

- రాజ్యాంగం అమలుపై ప్రశ్నలు
- భారత్ సమ్మిట్‌కు వ్యతిరేకంగా నిరసనకు పిలుపు
- తార్నాక నివాసంలో గృహనిర్బంధం
- ప్రజాస్వామ్య నిరసన హక్కును కాలరాస్తున్నారంటూ బీజేపీ ఆగ్రహం

2లో

- రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

తెలుగు తెరపై చెరగని ముద్ర.. సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత!

- ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు
- 600కు పైగా చిత్రాల్లో నటనతో గుర్తింపు
- టూరింగ్ టాకీస్ నుంచి తెలుగు సినీ పరిశ్రమ వరకు సాగిన ప్రస్థానం
- కాలం చెరపలేని పాత్రలు.. ప్రేక్షకులు మరిచిపోలేని నటుడు
- ఫిలిం ఛాంబర్‌లో సందర్శనార్థం పార్థివదేహం..
- సినీ ప్రముఖుల కన్నీటి నివాళి
- ఆదివారం స్వగ్రామం రావినూతలలో అంత్యక్రియలు



హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలుగు చిత్రసీమలో తీవ్ర విషాదం నెలకొంది. ఐదు దశాబ్దాలకు పైగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటుడు, నిర్మాత, దర్శకుడు గిరిబాబు (80) శనివారం (నవంబర్ 14) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో

।మిగతా 2 లో।



పాలిటెక్నిక్ కాలేజీలు విద్యాశాఖ పరిధిలోనే..

- జీవో 97కు సవరణ
- జీవో 157తో పాలిటెక్నిక్ విద్యార్థుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెర
- బీటెక్ లేటరల్ ఎంట్రీపై విద్యార్థుల ఆందోళనలకు స్పందన
- కె. కేశవరావు కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం
- ఐటీఐలు, ఏటీఐల నిర్వహణ బాధ్యతలు కార్మిక శాఖకే
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరి

2లో

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బీఎం సందీప్ కుమార్

- మీనాక్షి నటరాజన్ స్థానంలో బీఎం సందీప్ కుమార్‌కు బాధ్యతలు
- ఏఐసీసీ కీలక నిర్ణయం.. తక్షణమే అమల్లోకి కొత్త నియామకం
- తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం
- నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయమే కొత్త ఇన్‌చార్జి ముందున్న బాధ్యత
- నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల భర్తీపై పెరగనున్న కసరత్తు
- అంతర్గత విభేదాలు, అసంతృప్తులకు పరిష్కారం చూపడమే కీలకం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రత్యేక కార్యాచరణ





హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

బీఎం సందీప్ కుమార్‌ను ఏఐసీసీ అధిష్ఠానం నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ స్థానంలో

।మిగతా 2 లో।

అభయహస్తం హామీల అమలు ఏదీ..?

- రాహుల్ గాంధీకి కేటీఆర్ సూటి ప్రశ్నలు
- 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. 6 గ్యారెంటీలపై నిలదీత
- బీసీలకు రూ.లక్ష ◌ కోట్ల హామీ ఏమైంది?
- రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలే ఇచ్చారా?
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హామీల అమలుపైనా విమర్శలు



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయహస్తం'లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

।మిగతా 2 లో।

డెలివరీ బాయ్స్‌కు బీమా భరోసా

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

గిగ్ వర్కర్ల సంక్షేమం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. యాప్ ఆధారిత సేవల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఇతర గిగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే సంక్షేమ పథకాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని జయభేరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన గిగ్ వర్కర్ల బహిరంగ సభలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. కార్మికుల కష్టం, వారి సమస్యలు తనకు తెలుసునని, వారి హక్కులు, భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పథకం ద్వారా అర్హులైన గిగ్ వర్కర్లకు ఆరోగ్య, ప్రమాద బీమాతో పాటు పింఛన్, వైద్య సహాయం, వైకల్య ప్రయోజనాలు, ప్రసూతి ప్రయోజనాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రతి డెలివరీ, రవాణా లావాదేవీపై కంపెనీలు నిర్ణీత శాతం మొత్తాన్ని సంక్షేమ నిధికి జమ చేయనున్నాయి. ఈ నిధులను కార్మికుల సంక్షేమానికి వినియోగించనున్నారు. డెలివరీ పనుల కోసం ఎండల్లో, వర్షాల్లో ప్రయాణించే కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లో రెస్ట్ హౌస్‌లు నిర్మిస్తామని రాహుల్ గాంధీ వెల్లడించారు. కార్మికులకు ప్రతి డెలివరీపై వచ్చే ఆదాయ వివరాలు పారదర్శకంగా తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం: రాహుల్ గాంధీ

దేశంలో కార్మికుల హక్కులు, సంక్షేమంపై భిన్నమైన ఆలోచనా విధానాలు ఉన్నాయని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ విధానం మాత్రం కార్మికులకు రక్షణ కల్పించడం, దేశ అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడమేనని పేర్కొన్నారు. గిగ్ వర్కర్లతో పాటు వారి పిల్లల విద్య, ఆరోగ్యం విషయంలోనూ తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2023లో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు గిగ్ వర్కర్లు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిగ్ వర్కర్ల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని తెలిపారు.

ఆ హామీ మేరకే నేడు గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం అమలుకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గిగ్ వర్కర్లకు బీమా సదుపాయాలు, ఆరోగ్య భద్రత, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టామని వివరించారు. కార్మికుల హక్కులు, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిగ్ వర్కర్ల తరపున రాహుల్ గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఫాసిస్టు శక్తుల ఆగడాలు పెరిగిపోయాయి..

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

దేశంలో ఫాసిస్టు శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలు, దేశ రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ప్రక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిన పలువురు విదేశీ నాయకులు, ప్రతినిధులకు చివరి నిమిషంలో వీసాలు రద్దు చేయడంతో వారు కార్యక్రమానికి రాలేకపోయారని ఆరోపిస్తూ వారికి క్షమాపణలు తెలిపారు.సమాజంలో రెండు రకాల మనస్తత్వాలు ఉంటాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అన్నీ తమకే తెలుసని భావించేవారు ఒకరైతే.. ఇతరుల మాటలు వింటూ నేర్చుకునేవారు మరొకరని వివరించారు. రాజకీయాల్లో తమకే అన్నీ తెలుసని, తామే గొప్పవారమని భావించే వారే ఫాసిస్టులని వ్యాఖ్యానించారు. వ్యవస్థలు బలహీనపడినప్పుడు ఇలాంటి శక్తులు బయటకు వస్తాయని, ఇతరుల మాట వినకుండా తమ గొంతును మాత్రమే వినిపిస్తాయని విమర్శించారు. గత పదేళ్లుగా దేశంలో ఇలాంటి శక్తుల ప్రభావం పెరిగిపోయిందని, ప్రస్తుత పరిణామాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు.ఫాసిస్టు శక్తులను ద్వేషం, హింసతో ఎదుర్కోవడం తమ సిద్ధాంతం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తమతో కలిసి ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడే వారందరికీ స్వాగతం పలికారు. దేశంలోని ప్రతి మూల నుంచి ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవడమే తమ లక్ష్యమన్నారు. ఎవరినీ ద్వేషించడం, కించపరచడం తమ ఉద్దేశం కాదని, కోపం, ద్వేషం లేకుండా ప్రేమ, ఆప్యాయతతోనే పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. చివరకు సత్యం, అహింస, ప్రేమే విజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 2014 తరహా ఎన్నికలను తాను గతంలో ఎప్పుడూ చూడలేదని రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల్లో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీశారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని విమర్శించారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి ఎక్కువ స్థానాలు గెలుచుకున్నప్పటికీ, కేవలం మూడు నెలల వ్యవధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైందని గుర్తుచేశారు. ఈ మూడు నెలల్లో 70 లక్షలకు పైగా కొత్త ఓట్లు నమోదయ్యాయని, ఆ ఓట్ల నమోదుపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. కొత్తగా నమోదైన ఓట్ల కారణంగానే బీజేపీ విజయం సాధించిందని ఆరోపించారు.హైదరాబాద్, బెంగళూరు నగరాలు ఐటీ రంగంలో అద్భుతమైన అభివృద్ధి సాధిస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు దేశంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని విమర్శించారు. అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరణపై ప్రశ్నలు లేవనెత్తారు. 12 ఏళ్ల క్రితం సంపన్నుల జాబితాలో 600వ స్థానంలో ఉన్న అదానీ.. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో స్థానానికి చేరుకున్నారని వ్యాఖ్యానించారు. పోర్టులు, విమానాశ్రయాలు, మౌలిక సదుపాయాలు సహా అనేక రంగాల్లో అదానీ పెట్టుబడులు పెరిగాయని, మోదీ ప్రభుత్వ హయాంలోనే ఆయన వ్యాపారాలు విస్తరించాయని రాహుల్ గాంధీ ఆరోపించారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా
బీఎం సందీప్ కుమార్

తరువాయి భాగం

సందీప్ కుమార్‌కు అవకాశం కల్పించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ నియామకం తక్షణమే అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.

పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడంపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పరిపాలనతో పాటు పార్టీ కార్యకలాపాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం కొత్త ఇన్‌చార్జి ముందున్న ప్రధాన బాధ్యతగా మారనుంది. ముఖ్యంగా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని క్రియాశీలకంగా మార్చడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచడం కీలకం కానుంది.

అదేవిధంగా నామినేటెడ్ పదవుల భర్తీ, పార్టీ పదవుల కేటాయింపు, నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు, అసంతృప్తులను పరిష్కరించడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులను భాగస్వామ్యం చేయడం కూడా ఆయన బాధ్యతల్లో ముఖ్యమైన అంశం కానుంది.

స్థానిక ఎన్నికలే తొలి సవాల్!

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ రాజకీయ పరిణామాలు కొత్త ఇన్‌చార్జికి కీలక సవాళ్లుగా నిలవనున్నాయి. ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేయడం, అభ్యర్థుల ఎంపికలో సమన్వయం సాధించడం, అసంతృప్తులను బుజ్జగించడం వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.మొత్తంగా తెలంగాణ కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పుల దిశగా అధిష్ఠానం ఈ నియామకం చేపట్టినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంతో పాటు అంతర్గత సమస్యలను పరిష్కరించడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కొత్త ఇన్‌చార్జికి ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి.

తెలుగు తెరపై చెరగని ముద్ర..
సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత!

తరువాయి భాగం

చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో సినీ పరిశ్రమలో విషాదం అలుముకుంది. గిరిబాబు పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఫిలిం ఛాంబర్‌లో అభిమానులు, సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. పలువురు సినీ ప్రముఖులు అక్కడికి చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు తెరపై ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. గిరిబాబు మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

అనారోగ్యంతో మృతి.. చికిత్స పొందుతూ కన్నుమూత

గిరిబాబు కొంతకాలంగా అల్జీమర్స్, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు ఆయన కుమారుడు రఘుబాబు వెల్లడించారు. ఆరోగ్యం క్షీణించడంతో నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

టూరింగ్ టాకీస్ నుంచి వెండితెరకు..

గిరిబాబు అసలు పేరు యర్రా శేషగిరిరావు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే సినిమాలపై ఆసక్తి పెంచుకున్న ఆయన గ్రామంలోని టూరింగ్ టాకీస్‌లో సినిమాలు చూస్తూ ఎక్కువ సమయం గడిపేవారు. అనంతరం నాటకాలపై ఆసక్తితో సొంతంగా నాటక సమాజాన్ని ఏర్పాటు చేసుకుని నటనలో అనుభవం సంపాదించారు.సినిమాల్లో అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. తొలుత అనుకున్న కొన్ని చిత్రాలు వివిధ కారణాలతో ఆగిపోయినా పట్టుదలతో ముందుకు సాగారు.చివరకు 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు.'అన్నదమ్ముల అనుబంధం', 'దేవతలారా దీవించండి', 'సింహగర్జన', 'మల్లెపూవు', 'మాయదారి కృష్ణుడు', 'ఎర్రమల్లెలు', 'చట్టానికి వెయ్యి కళ్లు', 'పసివాడి ప్రాణం', 'విశ్వనాథ నాయకుడు', 'కిల్లర్', 'నిన్నే పెళ్లాడతా', 'అతడు', 'గమ్యం', 'ఖడ్గం', 'గీతగోవిందం' తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు.ప్రతినాయకుడిగా తనదైన శైలిలో మెప్పించడంతో పాటు హాస్య, సహాయ పాత్రల్లోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

కుటుంబానికి తీరని లోటు..

గిరిబాబు భార్య శ్రీదేవి 2016 మేలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు రఘుబాబు, బోసుబాబు ఉన్నారు. పెద్ద కుమారుడు రఘుబాబు తెలుగు చిత్ర పరిశ్రమలో హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు కూడా సినిమాల్లో నటించారు. గిరిబాబు మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు..

గిరిబాబు అంత్యక్రియలు ఆదివారం (నవంబర్ 15) మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య ప్రకాశం జిల్లా మేదరమెట్ల సమీపంలోని ఆయన స్వగ్రామం రావినూతలలో నిర్వహించనున్నారు. ఫిలిం ఛాంబర్‌లో సందర్శన కార్యక్రమం అనంతరం పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించనున్నారు. ఆయన మృతిపట్ల సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

నెహ్రూ దార్శనికతే
ఆధునిక భారతానికి పునాది

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు, దార్శనికత, శాస్త్రీయ దృక్పథాన్ని దక్షిణ భారతదేశమంతటా విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, శాస్త్రీయ ఆలోచనా విధానం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ద్వారా నెహ్రూవియన్ భావజాలాన్ని దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ప్రారంభోత్సవానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపీ, సెంటర్ ఇన్‌చార్జి సందీప్ దీక్షిత్‌ను అభినందించారు.

ఆధునిక భారత నిర్మాణంలో నెహ్రూ పాత్ర కీలకం

సంపన్న కుటుంబంలో జన్మించి, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ నెహ్రూ విలాసవంతమైన జీవితాన్ని వదులుకొని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని భట్టి గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ సుమారు 13 సంవత్సరాలు జైలు జీవితం గడిపారని తెలిపారు.మహాత్మా గాంధీ మార్గదర్శకత్వంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపిన ప్రముఖ నాయకుల్లో నెహ్రూ ఒకరని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం అనంతరం దేశం ఎదుర్కొన్న విభజన, మత ఘర్షణలు, ఆహార కొరత, ఆర్థిక సమస్యల మధ్య భారతదేశాన్ని ఐక్యంగా, పటిష్టంగా నిర్మించేందుకు నెహ్రూ కృషి చేశారని వివరించారు. స్వతంత్ర విదేశాంగ విధానం, అలీన విధానం ద్వారా అంతర్జాతీయంగా భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు.

విద్య, పరిశోధనలకు నెహ్రూ పెద్దపీట

దేశ అభివృద్ధికి విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలే కీలకమని నెహ్రూ ముందుగానే గుర్తించారని భట్టి తెలిపారు. యూజీసీ, ఐఐటీలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని, పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించేందుకు వివిధ సంస్థలను బలోపేతం చేశారని పేర్కొన్నారు. మిశ్రమ ఆర్థిక విధానం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనకు ప్రాధాన్యతనిచ్చారని వివరించారు. భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాలతో పాటు హెచ్ఎంటీ, బీహెచ్ఈఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు దేశ పారిశ్రామికాభివృద్ధికి పునాదులుగా నిలిచాయని అన్నారు.

నాగార్జునసాగర్, భాక్రా నంగల్, హీరాకుడ్ వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టుల నిర్మాణం వ్యవసాయాభివృద్ధి, విద్యుత్ ఉత్పత్తి, నీటిపారుదల విస్తరణకు దోహదపడిందని వివరించారు.

పిల్లల భవిష్యత్తే దేశ భవిష్యత్తు

పిల్లల విద్య, వికాసంపై నెహ్రూకు ప్రత్యేక శ్రద్ధ ఉండేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. నేటి బాలలే రేపటి దేశ నాయకులని, వారికి నాణ్యమైన విద్య, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణంతో పాటు 65కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.సంక్షేమ విద్యాసంస్థల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 25 శాతం పెంచినట్లు వివరించారు.

చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు తగవు

దేశ చరిత్రలో నెహ్రూ వంటి మహనీయుల పాత్రను విస్మరించడం, వారి సేవలను తక్కువ చేసి చూపించడం సమాజానికి నష్టం కలిగిస్తుందని భట్టి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక పరిణామాలను ప్రస్తావిస్తూ, అప్పటి ప్రభుత్వ నిర్ణయాలు, కేంద్ర మంత్రివర్గం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థల పాత్రను సమగ్రంగా అర్థం చేసుకోవాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను భావితరాలకు తెలియజేయాలని అన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలు విద్యాశాఖ పరిధిలోనే..

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకుంది. వాటిని కార్మిక శాఖ పరిధిలోకి మార్చాలనే ప్రతిపాదనపై వెనక్కి తగ్గింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో 97ను సవరిస్తూ తాజాగా జీవో 157ను విడుదల చేసింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు యథావిధిగా విద్యా శాఖ పరిధిలోనే కొనసాగనున్నాయి. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన ఆందోళనలు, అభ్యంతరాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఐటీఐలు, ఏటీఐలు కార్మిక శాఖ పరిధిలోకి

గతంలో పాలిటెక్నిక్ కళాశాలలను విద్యాశాఖ నుంచి వేరు చేసి కార్మిక శాఖలోని శక్తి విభాగం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం జీవో 97 జారీ చేసింది. అయితే తాజా సవరణలో పాలిటెక్నిక్ కళాశాలలను ఆ ప్రతిపాదన నుంచి మినహాయించింది. పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), అధునాతన శిక్షణ సంస్థలు (ఏటీఐలు) మాత్రం కార్మిక శాఖ పరిధిలోనే కొనసాగనున్నాయి. అదేవిధంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ విద్యాశాఖ పర్యవేక్షణలో పనిచేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విశ్వవిద్యాలయం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతి పొందాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం లేదని స్పష్టతనిచ్చింది.

విద్యార్థుల ఆందోళనలతో పునరాలోచన

పాలిటెక్నిక్ కళాశాలలను కార్మిక శాఖ పరిధిలోకి మార్చాలనే ప్రతిపాదనపై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల తమ విద్యా అవకాశాలు, భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. ముఖ్యంగా పాలిటెక్నిక్ పూర్తిచేసిన తర్వాత బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కల్పించే లేటరల్ ఎంట్రీ విధానం కొనసాగుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో జీవో 97ను రద్దు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేసింది. కె.కేశవరావు కమిటీ నివేదిక ఆధారంగా పాలిటెక్నిక్ కళాశాలలను విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. తాజాగా జీవో 157 విడుదల కావడంతో పాలిటెక్నిక్ కళాశాలల పరిధిపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది.





మాట ఇచ్చాం.. మంజూరు చేసి చూపించాం

- పేదల జీవితాల్లో సరికొత్త వెలుగులు.. అర్హులందరికీ పింఛన్లు అందించడమే లక్ష్యం
- పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ
- నియోజకవర్గానికి 5,124 పింఛన్లు మంజూరు
- నవంబర్ 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

పెద్దపల్లి/సుల్తానాబాద్ , తెలంగాణ చౌరస్తా:

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పెద్దపల్లి నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్లు మంజూరు చేసి చూపించామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలు, మండలాల పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్ల పత్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 768 మందికి, పెద్దపల్లి మండలంలో 1,114 మందికి, సుల్తానాబాద్ పట్టణంలో 286 మందికి, ఆ మండలంలోని 27 గ్రామాల్లో 755 మందికి పింఛన్లు మంజూరయ్యాయి.

నియోజకవర్గానికి 5,124 పింఛన్లు మంజూరు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గానికి మొత్తం 5,124 నూతన పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ నగదును జమ చేయనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, చేనేత, గీత కార్మికులు, ఇతర వృత్తిదారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా 11 వేల మందికి పైగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 5,124 మందికి, అంటే సుమారు 48 శాతం మందికి పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇది పెద్దపల్లి నియోజకవర్గానికి శుభవార్తగా అభివర్ణించారు. అర్హత ఉన్నప్పటికీ రెండు నుంచి మూడు శాతం మంది చిన్నచిన్న సాంకేతిక కారణాలతో పింఛన్లు పొందలేకపోయారని, అలాంటి వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సంబంధిత లోపాలను సరిదిద్ది రాబోయే రోజుల్లో వారికి కూడా పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. వృద్ధులకు ఏప్రిల్ నెల నుంచి కొత్త ప్రక్రియ ప్రారంభించి, 34 నెలల వ్యవధిలో అర్హులకు పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే దాదాపు 2,700 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు నూగిళ్ల మల్లయ్య, బిరుదు కృష్ణ, ఏఎంసీ చైర్మన్లు ప్రకాష్ రావు, డీఆర్‌డీఏ ఏపీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్లు ఆకుల వెంకటేష్, టి. రమేష్, తహసీల్దార్లు బషీరుద్దీన్, రాజయ్య, ఎంపీడీవోలు శ్రీనివాస్, దివ్య దర్శన్ రావు, సింగిల్ విండో చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం హామీల అమలు ఏదీ..?

తరువాయి భాగం

ప్రశ్నించారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుకు పొంతన లేదని ఆరోపించారు. ఈ మేరకు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని నిలదీశారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే మూడేళ్లలో రూ.5 వేల కోట్లలోపే కేటాయించారని ఆరోపించారు. విద్

ఓయూలో లహుజీ సాళ్వె 232వ జయంతి వేడుకలు

- లహుజీ జయంతిని 'రాష్ట్రీయ స్వతంత్రత సంకల్ప్ దివస్'గా నిర్వహించాలి
- మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా :



ఉస్మానియా యూనివర్సిటీలో క్రాంతిపిత లహుజీ సాళ్వె 232వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లహుజీ సాళ్వె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, సామాజిక చైతన్యంలో ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సాధించాలనే సంకల్పంతో వేలాది మంది స్వాతంత్ర్య సమర యోధులను తయారుచేసిన గొప్ప వ్యక్తి లహుజీ సాళ్వె అని పేర్కొన్నారు.మహాత్మాజ్యోతిబా ఫూలే చేపట్టిన విద్యా ఉద్యమానికి రక్షణగా నిలిచి, తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారని కొనియాడారు. వివాహం చేసుకోకుండా దేశం కోసం జీవితాంతం సేవలందించిన ఆయన జన్మదినాన్ని 'రాష్ట్రీయ స్వతంత్రత సంకల్ప్ దివస్'గా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మాంగ్ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లే శంకర్ మాంగ్ మాట్లాడుతూ.. లహుజీ సాళ్వె జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. మాంగ్ సమాజ అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రత్యేక కోచింగ్ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాంగ్ సమాజ్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు కాంబ్లే సుధాకర్ మాంగ్, కాంబ్లే అనిల్ కుమార్ మాంగ్, చవాన్ ఉదయ్ మాంగ్, కాంబ్లే బాలాజీ మాంగ్, అడ్వకేట్ జాదవ్ గోపాలకృష్ణ, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు మహేష్, సదానంద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వెంనూర్, కుక్కలగూడూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన మనాలి ఠాకూర్
- రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

పాలకుర్తి, తెలంగాణ చౌరస్తా:

రైతుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు శనివారం పాలకుర్తి మండలంలోని వెంనూర్, కుక్కలగూడూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా అధికారులు, ఐకేపీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రైతుల కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నాయకత్వంలో రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఐకేపీ సిబ్బంది, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో ఘనంగా బాల గ్రామసభ

- బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తు
- సర్పంచ్ పెద్దపల్లి తిరుమల

పాలకుర్తి, తెలంగాణ చౌరస్తా:

బాలల హక్కుల పరిరక్షణ, వారి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాలకుర్తి గ్రామంలో బాల గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాలల భద్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, రక్షణతో పాటు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ పెద్దపల్లి తిరుమల పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించినప్పుడే వారి భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లిటిల్ మాస్టర్స్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు




- నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు
- పిల్లలే దేశ భవిష్యత్తు.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి
- కరస్పాండెంట్ జంగిలి మల్లేష్ యాదవ్

కమాన్‌పూర్,తెలంగాణ చౌరస్తా:

భారత తొలి ప్రధానమంత్రి, బాలల ప్రియుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామంలోని లిటిల్ మాస్టర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు 'హ్యాపీ చిల్డ్రన్స్ డే' అక్షరాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ సందడి చేశారు. ఆటపాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జంగిలి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ..నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జంగిలి రజిత, ఉపాధ్యాయులు కొయ్యడ కోమలత, భాగ్యలక్ష్మి, శృతి, ఫౌజియా, అంజలి, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ 23వ వార్షికోత్సవం



- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ

కూకట్‌పల్లి,తెలంగాణ చౌరస్తా:

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం 23వ వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కాలనీవాసులపై పెద్దమ్మ తల్లి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు జి. రవీందర్ కుమార్, లావణ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. సురేందర్ రెడ్డి, సునీత దంపతుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడితో కళకళలాడాయి.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సీఐ స్వామిగౌడ్, ఎస్సైలు రవీందర్ రెడ్డి, మహిళా ఎస్సైలు ప్రవంతి, స్వాతి, మాజీ కార్పొరేటర్ రోజాదేవి, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కంఫర్ట్ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రిన్సిపాల్ సౌమ్య వినయ్
- ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు

కమాన్‌పూర్, తెలంగాణ చౌరస్తా:

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సౌమ్య వినయ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్ర, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్ర, బాలల పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాల గురించి వివరించారు.అనంతరం నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు పోలీస్, ఆర్మీ, డాక్టర్, ఉపాధ్యాయుడు, రైతు, స్వాతంత్ర్య సమరయోధులు, జవహర్‌లాల్ నెహ్రూ తదితరుల వేషధారణలో సందడి చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు విద్యార్థులు నెహ్రూ గొప్పతనాన్ని, బాలల దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగించారు. చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

ఆపదలో ఉన్న కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల చేయూత

- ఆలేటి భద్రయ్య కుటుంబానికి 100 కిలోల బియ్యం అందజేత

నూతనకల్ తెలంగాణ చౌరస్తా:

కుటుంబ పెద్దను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు.మండల పరిధిలోని యదవెల్లి గ్రామానికి చెందిన ఆలేటి భద్రయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని తుంగతుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు నేతృత్వంలో నాయకులు భద్రయ్య కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ అవసరాల నిమిత్తం 100 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఆపద సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దిండిగాళ్ల భూలక్ష్మి ఎంకన్న, గౌడ సంఘం అధ్యక్షుడు బొడ్డు సైదులు, రైతు సమితి మాజీ కోఆర్డినేటర్ తూముల వెంకటేశ్వరరావు, మాజీ వార్డు సభ్యుడు గాజుల ఉపేందర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు వెంకన్న, సీనియర్ నాయకులు గాజుల అమృతయ్య, తలారి రమేష్, గాజుల చిరంజీవి, బంటు జానీ, బొడ్డు లింగయ్య, బొడ్డు సూరయ్య, నెల్లుట్ల మల్లయ్య, బొడ్డు రవి, బయ్య గంగయ్య, గాజుల నరసయ్య, గాజుల సుదర్శన్, సంకి పాంచి తదితరులు పాల్గొన్నారు.



నాగార్జున పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం, కార్తీక వనభోజన వేడుకలు

- వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వేషధారణలతో అలరించిన విద్యార్థులు

నూతనకల్ తెలంగాణ చౌరస్తా:

మండల కేంద్రంలోని నాగార్జున ఐఐటీ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవం, కార్తీక వనభోజన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.మొదటగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంప్రదాయ వేషధారణలతో సందడి చేశారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి. అనంతరం కార్తీక మాసం సందర్భంగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సంప్రదాయబద్ధంగా కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆటపాటలు, సందడి మధ్య వేడుకలు ఆనందోత్సాహాలతో కొనసాగాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవం



కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.బాలల దినోత్సవ గ్రామసభ కార్యక్రమం ఏర్పాటు చేసి బాలలకు స్వీట్లు అందించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోశాల శైలజ సదానందం గౌడ్ మాట్లాడుతూ....నెహ్రూ కు పిల్లలు అంటే చాలా ఇష్టమని నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉయ్యాల చంద్రయ్య,ఉయ్యాల రాజసబ్,చిన్న పిల్లల తల్లిదండ్రులు ఉయ్యాలసాగర్,ఉయ్యాల రమేష్,గ్రామస్తులు జిన్నా నర్సింహారెడ్డి,గోపు రాజయ్య, గోపు కనకయ్య,బొంగోని శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పురాతన బావికి పూర్వవైభవం

- 'ఊరు కోసం ఒక్కరోజు' కార్యక్రమంలో రామగుండం బావి శుభ్రత
- మురుగుకాలువలు, రహదారుల పరిశుభ్రతకు గ్రామస్థుల చేయూత
- పురాతన నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
- సర్పంచ్ పబ్బు సతీష్

కమలాపూర్,తెలంగాణ చౌరస్తా:


గ్రామ పారిశుద్ధ్యమే లక్ష్యంగా చేపట్టిన 'ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం' కార్యక్రమంలో భాగంగా కమలాపూర్‌లోని పురాతన రామగుండం బావిని శుభ్రం చేశారు. శనివారం సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో 1, 2వ వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు కలిసి బావిలోని వ్యర్థాలను తొలగించడంతోపాటు మురుగుకాలువలు, రహదారులను శుభ్రం చేశారు.

గ్రామ చరిత్రకు ప్రతీకగా రామగుండం బావి..

ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నో కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు రామగుండం బావి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చిందని గుర్తుచేశారు. గ్రామ చరిత్రతో ముడిపడిన ఇలాంటి పురాతన నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శ్రమదానంతో శుభ్రం చేసిన బావిని భవిష్యత్తులోనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు.

పలువురి భాగస్వామ్యం..

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు మార్క అశోక్, అవునూరి తిరుపతి, పిల్లి సతీష్, ఎండపెల్లి మల్లారెడ్డి, మౌటం నాగరాజు, పుల్ల ఐలయ్య, బాలసాని కుమారస్వామి, పచ్చిమట్ల కుమారస్వామి, ప్రగతి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొంతకొండ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత



- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి. అనిల్ రెడ్డి
- బాలల దినోత్సవ వేడుకల్లో విద్యార్థులతో ముచ్చట.. ప్రతిభావంతులకు ఘన సన్మానం

కూకట్‌పల్లి, తెలంగాణ చౌరస్తా:

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డి. అనిల్ రెడ్డి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి ప్రతిభను అభినందించారు.ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారి ఉజ్వల భవిష్యత్తుకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అనంతరం క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తొమ్మిదో తరగతి విద్యార్థి హర్షద్‌ను శాలువాతో ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. అలాగే విద్యార్థులు బి. శృతి, తమయ్‌లను సైతం శాలువాలతో సన్మానించారు.బాలల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే తనకు నిజమైన ఆనందమని, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని అనిల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జగదీష్, ప్రదీప్ రెడ్డి, రాజు యాదవ్, లడ్డు టీం సభ్యులు, అనిల్ రెడ్డి మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





నల్గొండ నాగయ్య పి వై ఎల్ జిల్లా అధ్యక్షులుగా ఎంపిక

పీవైఎల్ సూర్యాపేట జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా నల్గొండ నాగయ్య..
- ప్రధాన కార్యదర్శిగా ధరావత్ రవి
- 13 మందితో నూతన కమిటీ ఏర్పాటు
- యువజన, ప్రజా సమస్యలపై పోరాటాలకు పిలుపు

నూతనకల్ తెలంగాణ చౌరస్తా:

ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సూర్యాపేట జిల్లా 9వ మహాసభ నూతనకల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో 13 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కోలా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



ధరావత్ రవి, పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

నూతన జిల్లా కార్యవర్గం:

జిల్లా అధ్యక్షుడిగా నల్గొండ నాగయ్య (తుమ్మల పెన్‌పహాడ్), ప్రధాన కార్యదర్శిగా ధరావత్ రవి (కొక్కిరేణి), ఉపాధ్యక్షుడిగా బండి రవి (సూర్యాపేట), సహాయ కార్యదర్శిగా గిరిబాబు (కందగట్ల), కోశాధికారిగా రమేష్ (డి.కొత్తపల్లి) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పోలేబోయిన కిరణ్ కుమార్, పొన్నం బ్రహ్మం, దండి ప్రవీణ్, దూదిపాల ప్రవీణ్, పంశీ, పోలేబోయిన సురేష్, పవన్ ఎన్నికయ్యారు.

మహాసభలో కీలక తీర్మానాలు:

మహాసభలో యువజన, ప్రజా సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలను ఆమోదించారు.

1. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి.
2. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టాలి.
3. ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలి.
4. పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి.
5. ఎస్ఐఆర్ (SIR) పేరుతో ఓటర్ల తొలగింపును తక్షణమే రద్దు చేయాలి.
6. నూతనకల్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడంతో పాటు బస్టాండ్, ప్రజా మరుగుదొడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాలి.యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, సామాజిక సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యవర్గం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని మహాసభలో పిలుపునిచ్చారు.



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

- బాలల దినోత్సవ వేడుకల్లో 70 మంది బాల కళాకారుల ప్రతిభాపాటవాలు

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామం ఎంఫీ థియేటర్‌లో శనివారం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పదేళ్లలోపు వయస్సు గల సుమారు 70 మంది చిన్నారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.హరిణి గౌతమ్, సాయి చరణ్, సాహితి అజ్జరపు, సత్య ప్రసూన శిష్య బృందాలకు చెందిన చిన్నారులు వివిధ శాస్త్రీయ నృత్యాంశాలను ప్రదర్శించారు. శ్లోకాభినయం, నారాయణతే, ఇదిగో భద్రాద్రి, బ్రహ్మాంజలి, మహా గణపతి, గరుడ గమనం, పుష్పాంజలి, మూషిక వాహన, గణపతి కౌతం, తీరు తీరు జవరాల, బొమ్మ బొమ్మ త, అంబ శాంభవి, శబ్దం తిల్లై తదితర అంశాలపై అద్భుతంగా నృత్యం చేశారు. చిన్న వయస్సులోనే శాస్త్రీయ నృత్యాల్లో చక్కటి అభినయం, లయబద్ధమైన కదలికలు, హావభావాలను ప్రదర్శిస్తూ బాల కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలతో ఎంఫీ థియేటర్ సందడిగా మారింది. వారి కళా నైపుణ్యానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో పాటు చప్పట్లతో అభినందనలు తెలిపారు.



స్కానింగ్ కేంద్రాలపై డీఎంహెచ్ఓ ఆకస్మిక దాడి

- లోటుపాట్లు గుర్తించి ఆసుపత్రికి నోటీసులు జారీ
- గోదావరి పుష్కర ఘాట్లు, వైద్య శిబిరాల ఏర్పాట్లపై సమీక్ష
- వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు అందాలి
- డాక్టర్ తుకారామ్ రాథోడ్

భద్రాచలం భద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా :

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తప్పవని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ హెచ్చరించారు. శనివారం ఆయన భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.

మిమ్స్ ఆసుపత్రికి నోటీసులు.. భద్రాచలంలోని మిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి, గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో పలు లోటుపాట్లు గుర్తించి, ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

పుష్కర ఘాట్ల పరిశీలన..

రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భద్రాచలంలోని పుష్కర ఘాట్లను ఆయన సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేయాల్సిన వైద్య శిబిరాలు, మందుల నిల్వలు, సిబ్బంది కేటాయింపుపై అధికారులతో సమీక్షించారు.

టీకాల కార్యక్రమం వంద శాతం పూర్తి కావాలి..

అనంతరం ఎంపీ బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సారపాక ఉప కేంద్రాన్ని తనిఖీ చేసి వ్యాధి నిరోధక టీకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు నిర్దిష్ట సమయంలోగా అన్ని రకాల టీకాలు వేయాలని ఆదేశించారు. టీకాలు తీసుకోకుండా మిగిలిపోయిన పిల్లల జాబితాను రూపొందించి, వారందరికీ వంద శాతం టీకాలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో కొత్తగూడెం ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి మోహన్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సిపి జెట్

- ఆదేశాలు శాతవాహనకు వర్తించయా
- బిఆర్ఎస్వి శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్

కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాష్ట్ర సిపి జెట్ ఆదేశాలు శాతవాహనకు వర్తించయా అంటూ శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ ప్రశ్నించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... శాతవాహన విశ్వవిద్యాలయంలో 2026 27 విద్యా సంవత్సరానికిగాను చివరి దశ కౌన్సిలింగ్ ముగిసిన తర్వాత కూడా ఆయా యూనివర్సిటీల లో మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థులకు అడ్మిషన్ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర సిపి జెట్ 27 అక్టోబర్ 2026 రోజున వంద లాదిమంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఒక సర్కులర్ జారీ చేసింది 30 అక్టోబర్ 2026 రోజున ప్రముఖ దినపత్రికలకు ప్రకటన ఇచ్చి 3 నవంబర్ 2026 నుండి 7 నవంబర్ 2026 లోపు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు.కానీ శాతవాహనలో యూనివర్సిటీ లో 386 సీట్లు ఖాళీ ఉండగా సిపి జెట్ సర్కులర్ ను తుంగలో తొక్కుతూ శాతవాహన వీసి 386 సీట్లు ఖాళీ ఉండగా స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా వాటిని భర్తీ చేయకుండా కావాలని వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాడని,విద్యార్థుల భవిష్యత్తు పట్ల నిజంగా అంకితభావం ఉంటే సిపి జెట్ ఇచ్చిన సర్కులర్ ని పరిగణలోకి తీసుకొని మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసి ఉండాలి చేయలేదు అంటే విద్యార్థుల భవిష్యత్తుపై వీసీకి ఎంత అంకిత భావం ఉందో అర్థమవుతుందని,కానీ వీసీకి అంత ప్రేమ ఎందుకో కానీ ఒక్క ఫార్మసీ కోర్స్ కు మాత్రమే స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించి మిగిలిన వాటికి నిర్వహించలేదు.కెమిస్ట్రీలో 32,కంప్యూటర్ సైన్స్ లో 23,మ్యాథ మెటిక్స్ లో 30,ఫిజిక్స్ 26,ఫోరెనిక్ సైన్స్ 3,న్యూట్రిషన్ 3,ఫుడ్ సైన్స్ 2, ఇంగ్లీష్ లో 13,తెలుగులో 2, ఉర్దూ 17,ఎకనామిక్స్ 15,సోషియాలజీ 12,ఎమ్మెస్ డబ్ల్యూ 20,ఎం కామ్ జనరల్ 4, ఎం కామ్ ఫైనాన్స్ 6,ఎంబీఏ 18,ఎల్.ఎల్.బి లో 24,ఇంజనీరింగ్ SE 12,AI 19, ECE 31,IT 60 ఫార్మసీలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాత కూడా 12,ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్ కావడానికి సిద్ధంగా ఉన్నా విద్యార్థులు చేసిన అన్యాయం ఏమిటో చెప్పాలని,అటెండెన్స్ పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నట్లు చాలామంది విద్యార్థులు వాపోతున్నారని,విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలతోటి మా పిల్లలు చదువుకుంటారని యూనివర్సిటీలకు పంపితే యూనివర్సిటీలో అటెండెన్స్ పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేయడం వల్ల వారు ఒత్తిడికి లోనై ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకునే అవకాశం కూడా ఉంది ఇప్పటికైనా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ అటెండెన్స్ పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా ఇప్పటికైనా మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.



వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- ఇబ్బందులు పడుతున్నరైతులు
- కొనుగోలు కేంద్రాలను సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు
- వెంటనే కాంటాలు ప్రారంభించాలని డిమాండ్

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తాజా మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్,మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ...ఎమ్మెల్యే విజయరమణారావు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నప్పటికీ,ఇప్పటివరకు మండలంలోని ఏ కొనుగోలు కేంద్రం నుంచి ప్రభుత్వం ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు.కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు ప్రారంభించి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన రైతు కుమార్ తన ఆవేదనను వ్యక్తం చేశారు.15 రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి పోసినప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు జరగలేదని తెలిపారు.కేంద్రంలో పర్యవేక్షణ చేసే అధికారులు అందుబాటులో ఉండటం లేదని,ధాన్యం తేమశాతాన్ని సైతం పరిశీలించే వారు రావడం లేదని వాపోయారు.ధాన్యాన్ని ఆరబెట్టేందుకు పరదాల అద్దె భారం పడటంతో పాటు,వడ్లు బాగా ఎండిపోవడం వల్ల నాణ్యత దెబ్బతిని నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎం.డీ ఇబ్రహీం,రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నిదానపురం దేవయ్య,మాజీ సర్పంచ్ లు ఆడెపు శ్రీదేవి రాజు,గోనె శ్యామ్, మర్రి మహేందర్,ఉపసర్పంచ్ సంధ్యవేణు,బిఆర్ఎస్ నాయకులు సారంగపాణి, వెన్నెల సదానందం,దండి అజయ్ కుమార్,జక్కెన బోయిన కనుకయ్య,బండారి ఓదెలు, మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కుంట శ్రీకాంత్,కుంభం రాజు ముదిరాజ్,రైతులు,తదితరులు, పాల్గొన్నారు.

వైద్యుల సమయస్ఫూర్తి.. తల్లీబిడ్డలకు పునర్జన్మ!

- అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స
- 4.8 గ్రాములకు పడిపోయిన హిమోగ్లోబిన్.. ప్రాణాపాయ స్థితిలో గర్భిణీ
- చాకచక్యంగా వ్యవహరించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన డాక్టర్లు

అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:

ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ గర్భిణీకి సకాలంలో అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడారు అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి మరోసారి తమ వైద్య నైపుణ్యాన్ని చాటుకున్నారు.

క్లిష్ట పరిస్థితుల్లో శస్త్రచికిత్స..

అశ్వారావుపేట మండలం గుంటిమడుగు గ్రామానికి చెందిన ఆశీ సమ్మక్క ప్రసవం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స ప్రారంభించగా, ఒక్కసారిగా తీవ్ర రక్తస్రావం మొదలైంది. అప్పటికే ఆమె హిమోగ్లోబిన్ స్థాయి 8.1 గ్రాముల నుంచి 4.8 గ్రాములకు పడిపోవడంతో పరిస్థితి విషమించింది. గర్భసంచి తొలగించాల్సినంత తీవ్రమైన సవాలు ఎదురైనప్పటికీ గైనకాలజీ వైద్యులు డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ మౌనిక ఏమాత్రం ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించారు. చాకచక్యంగా శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం తల్లికి అత్యవసరంగా ఒక యూనిట్ ఏబీ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించడంతో తల్లీబిడ్డలు ఇద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

వైద్యులను అభినందించిన ఎమ్మెల్యే..

క్లిష్ట పరిస్థితుల్లోనూ తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడిన డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ మౌనికలను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యులు అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని ఆయన కొనియాడారు.



మహిళలకు దాసరి ఉష భరోసా

- 22న పెద్దపల్లిలో మెగా జాబ్ మేళా
- కొండరకలాన్ లో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో వెయ్యికి పైగా ఉద్యోగాలు
- విద్యార్హతలు బట్టి ఉద్యోగ అవకాశాలు
- మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న మహిళలకు బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష భరోసానిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచిచూస్తూ, కాలాన్ని వృథా చేసుకోకుండా హైదరాబాద్ లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో నెలకు రూ. 21,851/ వేతనంతో ఉద్యోగాలు కల్పించే సదుద్దేశంతో శనివారం జిల్లా కేంద్రం లోని ఆమె నివాసంలో పలువురు మహిళలు, నాయకులతో కలిసి మెగా జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు హైదరాబాద్ లోని కొండరకలాన్ లో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో వెయ్యికి పైగా ఉద్యోగాల భర్తీ కోసం జిల్లాలోని ప్రతి గ్రామంలోని, ముఖ్యంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈనెల 22న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్ సింధూర ఐటిఐ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. ఉదయం 9 నుండి సాయంత్రం 5గంటల వరకు ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్హతల ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారని చెప్పారు. ఆయా ఉద్యోగాలకు సంబంధించి ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ మహిళలు ఇదొక సదవకాశంగా భావించి, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మెగా జాబ్ మేళాకు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి. వివరాల కోసం 9240954734 నెంబర్ ను సంప్రదించుకోగలరని పేర్కొన్నారు.



గిగ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం

- రాహుల్ గాంధీ
- మాదాపూర్‌లో గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ
- కార్మికులతో కలిసి ప్రయాణించిన రాహుల్
- రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

గిగ్ వర్కర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. ఐటీ కారిడార్ మాదాపూర్‌లో గిగ్ వర్కర్లు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.శిల్పారామం ప్రభుత్వ ఆడిటోరియం నుంచి జయభేరి మైదానం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఓ గిగ్ వర్కర్ బైక్‌పై వెనుక కూర్చుని రాహుల్ గాంధీ ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం జయభేరి మైదానంలో నిర్వహించిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిరంతరం శ్రమించే గిగ్ వర్కర్ల ఆదాయం, సంపాదనకు సంబంధించిన స్పష్టమైన లెక్కలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎండ, వానలను లెక్కచేయకుండా పనిచేసే డెలివరీ సిబ్బంది విశ్రాంతి కోసం వైఫై సదుపాయంతో కూడిన ప్రత్యేక షెల్టర్లను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం 12 హామీలతో ప్రత్యేక విధానాన్ని రూపొందించామని తెలిపారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేస్తామని ప్రకటించారు. అధికారుల కార్యాలయాల్లో కూర్చొని కాకుండా క్షేత్రస్థాయిలో కార్మికుల అభిప్రాయాలను సేకరించి, వారి అవసరాలకు అనుగుణంగా ఈ విధానాన్ని రూపొందించినట్లు వివరించారు.
రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలోనే గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమానికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందని సీఎం వెల్లడించారు. ఈ బిల్లు ఆధారంగా కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు.



నాగార్జున పాఠశాలలో
ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- బాలలే భావి భారత పౌరులు.. వారి చిరునవ్వే దేశ భవిష్యత్తుకు వెలుగు
- విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలి
- కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి

రామన్నపేట, తెలంగాణ చౌరస్తా:

నాగార్జున పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. బాలలే భావి భారత పౌరులని, వారి చిరునవ్వులోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చెట్ల పెంపకం-నీటి పొదుపు, దీపావళి సంబరాలు, ఆన్‌లైన్ గేమ్స్‌తో భవిష్యత్తుకు పొంచి ఉన్న ముప్పు వంటి అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్‌లు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు, ఉత్సాహం, ఆనందం వెల్లివిరియడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు మధురానుభూతిని మిగిల్చాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖ, ఉపాధ్యాయులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.






వనస్థలిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో
వైద్య సేవలు అస్తవ్యస్తం

- ఆసుపత్రి తీరుపై బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆగ్రహం
- మందుల కొరత.. ఎక్స్‌రేలు, జనన–మరణ ధ్రువపత్రాల కోసం డబ్బుల వసూళ్లపై ఫిర్యాదులు
- ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి
- నిర్లక్ష్యపు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి
- సమగ్ర విచారణ జరిపి, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్

ఎల్బీనగర్,తెలంగాణ చౌరస్తా:

వనస్థలిపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద, మధ్యతరగతి ప్రజలకు కనీస వైద్య సేవలు అందడం లేదని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ నేతృత్వంలో నాయకులు ఆసుపత్రిని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.జ్వరాలు, దగ్గు, మలేరియా వంటి సాధారణ వ్యాధులకు సైతం సరైన చికిత్స, వైద్య పరీక్షలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు. కనీసం డోలో650 మాత్రలు కూడా ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో బయటి మెడికల్ షాపులకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఎక్స్‌రేలు, జనన-మరణ ధ్రువపత్రాల జారీ కోసం సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేందర్‌ను వివరణ కోరగా, టీఎస్ఎంఐడీసీ నుంచి మందుల సరఫరా, నిధుల కొరత ఉందని వివరించినట్లు నాయకులు తెలిపారు. ఇటీవల ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణీని చేర్చుకోకపోవడంతో మరో ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిన ఘటనపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విధులకు గైర్హాజరవుతూ, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీఎఫ్ మహిళా అధ్యక్షురాలు సీత మహాలక్ష్మి, మద్దిమడుగు రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర ప్రజా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నూకల మల్లేష్‌యాదవ్, అడ్వకేట్ దినేష్ కుమార్, పందిరి వినోద్ గౌడ్, గుర్రం విజ్ఞాన్ రెడ్డి, ఎర్ర శ్రీహరి గౌడ్, గజ్జె శ్రీనివాస్ గౌడ్, కారింగుల రవీందర్ గౌడ్, రాజనగర శ్రీకాంత్, పందుల వెంకటేష్ గౌడ్, ఉయ్యాల కుమార్ గౌడ్, కొంగరి కృష్ణ పద్మశాలి, మామిడి గిరీష్ గౌడ్, గోరా శ్యాం సుందర్ గౌడ్‌తో పాటు తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో రాణించాలి



- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్
- కొత్తగూడెంలో ఘనంగా రెండు తెలుగు రాష్ట్రాల టాలెంట్ షో-2 డాన్స్ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ముఖ్య అతిథి

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పుస్తకాల పురుగులుగా మారుతున్నారని, అలా కాకుండా సాంస్కృతిక పోటీలు,క్రీడల్లో రాణించి నప్పుడే వారు మానసిక ఉల్లాసంగా ఉండగలరని జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సిఈఆర్ క్లబ్ వేదికగా భద్రాద్రి ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రెండు తెలుగు రాష్ట్రాల టాలెంట్ షో'2' డాన్స్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా యెర్రా కామేష్ మాట్లాడుతూ..

నేటి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం చదువుకే పరిమితం చేస్తున్నారని, ఇలా చేయడం వల్ల వారిలో దాగి ఉన్న సృజనాత్మక కళలు వెలుగులోకి రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరిలోనూ అంతర్లీనంగా ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి తగిన శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టించగలరని పేర్కొన్నారు. పోటీల్లో ఎలాంటి బెరుకు లేకుండా చిన్నారులు అద్భుతంగా తమ నృత్యాలను ప్రదర్శించడం ముచ్చటగా ఉందన్నారు.కొత్తగూడెం కళాకారులు కేవలం జిల్లా స్థాయికే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. మొదటి సిరీస్ విజయవంతం కావడంతో, అంతకంటే చక్కగా రెండవ సిరీస్ పోటీలను నిర్వహించిన డాన్స్ మాస్టర్ ప్రభురాజ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో టాలెంట్ షో న్యాయనిర్ణేతలుగా తంబీ రాజ్, శ్యామల, గీత వ్యవహరించగా.. వీరితో పాటు తాటిపల్లి శంకర్, పిడుగు శ్రీను, డాక్టర్ లక్ష్మీ, తెరాల లక్ష్మీభద్రం, పుష్కల్, కమల, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ నాన్ టీచింగ్ ఉద్యోగుల న్యాయమైన
సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- 20 రోజులుగా కొనసాగుతున్న ఉద్యోగుల పోరాటానికి విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థుల మద్దతు
- ఆర్ట్స్ కాలేజీలో రౌండ్ టేబుల్ సమావేశం
- సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ చౌరస్తా:

ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులు గత 20రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి ఓయూ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థుల సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.
సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిలో నాన్ టీచింగ్ ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగులు అనేక ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు,టైమ్ స్కేల్,ఔట్‌సోర్సింగ్,రెగ్యులర్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాన్ టీచింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో నాయకులు పలు డిమాండ్లు చేశారు.
2001 నుంచి 2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (OPS) అమలు చేయాలని, 01092004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (CPS) అమలు చేయాలని కోరారు. ఎన్జీవోలు, టెక్నికల్, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
అసిస్టెంట్ రిజిస్ట్రార్, యూనివర్సిటీ బిల్డింగ్ డివిజన్ అధికారులకు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, అర్హులకు టైమ్ స్కేల్ వేతనాలు అమలు చేయాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన ఈపీఎఫ్ (EPF) బకాయిలను వెంటనే చెల్లించాలని, పెండింగ్ ఉద్యోగ ప్రయోజనాలను అందించాలని కోరారు. ఏప్రిల్ 2023 నుంచి నిలిపివేసిన కాంట్రాక్టు ఉద్యోగుల నెలవారీ రూ.1,500 వార్షిక ఇంక్రిమెంట్లను బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.అక్టోబర్ 2023 నుంచి నిలిపివేసిన ట్రైనింగ్ ఉద్యోగుల పదవీ విరమణ, మరణానంతర ఆర్థిక ప్రయోజనాలను రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచి అందించాలని కోరారు.
మరణించిన 41 మంది ఉద్యోగుల కుటుంబాలకు, పదవీ విరమణ పొందిన 8 మంది ఉద్యోగులకు సంబంధించిన ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.10 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని కోరారు. ఉద్యోగంలో ఉండగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం కనీసం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.
ఉద్యోగ సంఘాలు సమర్పించిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని నాయకులు కోరారు.

రూ.1,000 కోట్ల నిధులు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులను ఇప్పటివరకు విడుదల చేయకపోవడంపై నాయకులు విమర్శలు వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రకటించిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థులు, ప్రజా స్వామిక సంఘాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. జేఏసీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థులు ముందుండి పోరాటానికి మద్దతు ఇస్తారని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను కూడా ప్రకటిస్తామని పేర్కొన్నారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షుడు కిరణ్, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా క్రాంతి దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, జర్నలిస్ట్ రఘు, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆర్.ఎల్. మూర్తి, ప్రొఫెసర్ వెంకట్ దాస్, ప్రొఫెసర్ నతనియల్, డాక్టర్ బక్క జడ్సన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్య, జార్జ్ రెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, టీవీయూవీ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల బద్రి, పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మహేష్, ఏఐఓబీసీ అధ్యక్షుడు మహేష్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, సీఐటీయూ ఓయూ అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర కార్యదర్శి నారాయణ, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మన అశోక్ యాదవ్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంత మౌర్య, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ శీను, నాన్ టీచింగ్ జేఏసీ నాయకులు డాక్టర్ కుమార్, అధ్యక్షుడు ఖాదీర్ ఖాన్, వెంకటేష్, ప్రేమ్, రాజేష్, పవన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ప్రదీప్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు అశ్విని, హర్షవర్ధన్, మనోజ్, పరిశోధక విద్యార్థులు సునీల్ శెట్టి, కరణ్, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో ఐకేపీ కేంద్రం ప్రారంభం

- రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి
- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్
- మద్దతు ధర అందేలా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ

పాలకుర్తి,తెలంగాణ చౌరస్తా:

రైతులకు మద్దతు ధర అందించడంతోపాటు ధాన్యం విక్రయ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పాలకుర్తిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ఎయిర్‌పోర్ట్ పద్ద ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రైతులకు అందేలా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, పాలకుర్తి మండల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ నాయకులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బాలల భవితకు భరోసా..
ప్రజా సంక్షేమమే ధ్యేయం!

- ఎన్‌కే నగర్ బాదావత్ తండాలో ఘనంగా గ్రామసభ, బాలల దినోత్సవ వేడుకలు
- అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ల పత్రాలు పంపిణీ చేసిన
- సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా:

ఎన్‌కే నగర్ బాదావత్ తండా గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గ్రామసభ వేదికగా బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్ చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని,పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామసభలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసే క్రమంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పత్రాలను సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.కొత్తగా పింఛన్లు అందుకున్న వృద్ధులు, దివ్యాంగులు, ఇతర ఆసరా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: సర్పంచ్

ఈ సందర్భంగా సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలో ఏ ఒక్క అర్హుడైన పేదవాడు సంక్షేమ ఫలాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అందరూ కలిసికట్టుగా తండాను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

